కేటీఆర్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు

కేటీఆర్‌ను కలిసిన ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి

మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 30 : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావును సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, బీఆర్ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. బీఆర్ఎస్ బలోపేతానికి కష్టపడి పని చేయాలని కేటీఆర్ వారికి సూచించారు. పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, బీఆర్ఎస్ నాయకులు చిట్యాల జనార్దన్, మార్నేని రఘు, శంకర్, అంబాల శివ పాల్గొన్నారు.

చైర్మన్‌కు వినతి పత్రం అందస్తున్న స్థానికులు

60 ఫీట్ల వెడెల్పుతోనే రోడ్డు నిర్మించాలి

కేసముద్రం, డిసెంబర్ 30 : మండల కేంద్రంలో రోడ్డు విస్తరణలో భాగంగా రోడ్డును 60 ఫీట్ల వెడెల్పుతోనే నిర్మించాలని కోరుతూ మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డికి స్థానికులు మార్కెట్ కార్యాలయంలో సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువుర మాట్లాడుతూ.. 80ఫీట్ల వెడెల్పుతో రోడ్డు నిర్మిస్తే ఇరువైపులా ఉన్న వారి విలువైన ఇండ్లు కోల్పోవాల్సి వస్తుందన్నారు. మార్కెట్ సెంటర్‌లో, అంబేద్కర్ సెంటర్‌లో ఉన్న చిన్న చిన్న దుకాణాలు పూర్తిగా తొలగించాల్సి వస్తుందని, వారు ఉపాధి కోల్పోయే అవకాశం ఉందన్నారు. నివాసితుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని 60 ఫీట్ల వెడెల్పుతోనే ఇండ్లు నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్తినేని పాపారావు, శివ్వారపు శ్రీధర్, కంచ వెంకన్న, మోడెం వెంకటేశ్వర్లు, జంపాల రమేశ్, కొత్తకొండ యాదగిరి, లెంకపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల దీక్షకు సంఘీభావం ప్రకటిస్తున్న బీసీ రాజ్యాధికార సమితి సభ్యులు

డిమాండ్లను నెరవేర్చాలి

మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 30 : సమగ్ర శిక్ష ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర కార్యదర్శి, మోకు దెబ్బ జిల్లా అధ్యక్షుడు ముంజాల రాజేందర్‌గౌడ్ అన్నారు. ఎమ్మార్వో సెంటర్‌లో సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న దీక్షకు మద్దతు తెలిపి మాట్లాడారు. సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చి ఏడాది గడిచినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో జేరిపోతుల వెంకన్న, గండి వీరేందర్‌గౌడ్, శ్రీధర్, సమగ్ర శిక్ష ఉద్యోగులు పాల్గొన్నారు.

జిల్లాలో 4,327 కేసులు

- గంజాయి నియంత్రణకు ప్రత్యేక టీమ్
- చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు
- వార్షిక నివేదికను వెల్లడించిన ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్

మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 30 : చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ హెచ్చరించారు. సోమవారం ఆయన టౌన్ పోలీస్ స్టేషన్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో జిల్లా వార్షిక క్రైమ్ రిపోర్ట్ వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. గత సంవత్సరం మొత్తం 4,165 కేసులు నమోదు కాగా, 2024లో 4,327కేసులు నమోదైనట్లు తెలిపారు. గతేడాది కంటే ఈ సారి 162 కేసులు పెరిగాయన్నారు. ఇందులో ప్రధానంగా మర్డర్ కేసులు 16, పోక్సో 29, రేప్ 12, ఎస్సీ, ఎస్టీ 61, ఆస్తులకు సంబంధించిన కేసులు 265 నమోదైనట్లు చెప్పారు. జిల్లాలో గంజాయి, డ్రగ్స్ నియంత్రణకు ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పాఠశాలలు, కళాశాలల్లో సైబర్ క్రైమ్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలో గుడుంబాపై నియంత్రణ ఉందన్నారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలతో ఇబ్బందిపడిన ప్రజలకు సహాయ సహకారాలు అం దించామని, భవిష్యత్‌లో నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించి కట్టడి చేస్తామన్నారు. ఈ సమావేశంలో డీఎస్పీ తిరుపతిరావు, సీఐలు దేవేందర్, సర్వయ్య, ఎస్సైలు పాల్గొన్నారు.

వార్షిక క్రైమ్ రిపోర్ట్ నివేదికను విడుదల చేస్తున్న ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్

అత్యుత్సాహం ప్రదర్శించొద్దు

నూతన సంవత్సర వేడుకల పేరుతో అత్యుత్సాహం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో క్షేత్రస్థాయిలో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తామని, తాగి వాహనాలు నడిపి, అల్లర్లు చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. అర్ధరాత్రి ఆరుబయట వేడుకలకు అనుమతి లేదని, 144సెక్షన్ అమలులో ఉన్నందున బయట ఐదుగురు మించి గుమికూడొద్దన్నారు. మద్యం మత్తుతో విచక్షణ కోల్పోయి ప్రవర్తిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ ప్రశాంత వాతావరణంలో వేడుకలు జరుపుకోవాలని సూచించారు.

ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి

మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 30 : ప్రజావాణి దరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ వీరబ్రహ్మాచారి అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. నిరుపేద కుటుంబానికి చెందిన తనకు ఉపాధి కల్పించాలని నెల్లికుదురు మండలానికి చెందిన రజినీకుమార్ వినతి పత్రం అందజేశారు. పట్టణానికి చెందిన గాండ్ల ముత్తయ్య వృద్ధాప్య పింఛన్ ఇప్పించాలని, రెడ్యాల గ్రామానికి చెందిన లింగం రైస్‌మిల్లు వ్యర్థాల వల్ల తమ వ్యవసాయ భూములు దెబ్బతింటున్నాయని, వెంటనే తగిన పరిష్కా రం చూపాలని వినతి పత్రాలు అందజేశారు.

అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఆకుల రమేశ్

ఇండియన్ బ్యాంకు మేనేజర్‌పై చర్యలు తీసుకోవాలి

ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న ఇండియన్ బ్యాంకు మేనేజర్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని చిన్నగూడూరు మం డలం జయ్యారానికి ఆకుల రమేశ్ సోమవారం అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. పది సంవత్సరాలుగా ఇం డియన్ బ్యాంకులో క్రాప్‌లోన్ తీసుకుంటున్నానని, గతేడాది నుంచి తన అకౌంట్‌ను హోల్డ్‌లో పెట్టి ఇబ్బంది పెడుతున్నట్లు తెలిపాడు. తనతోపాటు చాలామంది రైతుల అకౌంట్ నంబర్ల ను హోల్డ్‌లో పెట్టి ఇబ్బందిపెడుతున్నాడని, వెంటనే విచారణ చేసి చర్యలు తీసుకోవాలన్నారు.

విద్యార్థులు లక్ష్యంతో చదవాలి

తొర్రూరు, డిసెంబర్ 30 : విద్యార్థులు లక్ష్యంతో చదవాలని తెలంగాణ సోషల్ స్టడీస్ ఫోరం కన్వీనర్ ఏ బ్రహ్మానందరెడ్డి అన్నారు. సోమవారం తొర్రూరు హైస్కూల్‌లో మండల స్థాయి సోషల్ స్టడీస్ టాలెంట్ పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాల స్థాయిలోనే విద్యార్థులు లక్ష్యంతో చదవాలన్నారు. పోటీ పరీక్షల్లో మండల స్థాయిలో కంఠాయపాలెం హైస్కూల్ విద్యార్థి టీ రిషిక, ఈ నవ్యశ్రీ ఎంపికైనట్లు తెలిపారు. మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులు జనవరి 4న జిల్లా స్థాయిలో నిర్వహించే పోటీ పరీక్షల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు డీ శంకర్, కే అనంతరెడ్డి, ఎండీ యాకూబ్‌అలీ, పీ నాగరాజు, రాధాదేవి, కవిత, శ్రీనివాస్, చంద్రమౌళి, నాగరాజు, స్వామి, భూపాల్, రాజు తదిరులు పాల్గొన్నారు.

తొర్రూరు హైస్కూల్‌లో సోషల్ స్టడీస్ టాలెంట్ పరీక్ష పత్రాలతో ఉపాధ్యాయులు

జిల్లా స్థాయికి విద్యార్థుల ఎంపిక

మరిపెడ, డిసెంబర్ 30: తెలంగాణా సోషల్ ఫోరమ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సోషల్ టాలెంట్ టెస్ట్‌లో మండల స్థాయిలో వీరారం పాఠశాలకు చెందిన శ్రీకాంత్, టీఎస్ మోడల్ స్కూల్ చెందిన విద్యార్థి గండి సాయి ప్రథమ, మరిపెడ పాఠశాలకు చెందిన విద్యార్థి దామోదర్ ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఎంఈవో అనితాదేవి ప్రశంసాపత్రాలను అందజేశారు.

40 క్వింటాళ్ల బియ్యం పట్టివేత

పెద్దవంగర, డిసెంబర్ 30 : 40 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుకొని, ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై క్రాంతికిరణ్ సోమవారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. బొమ్మకల్లు శివారులోని అవుసలితండాలో యాదాద్రి భువనగిరి జిల్లా, తుర్కపల్లి మండలం, బండతండాకు చెందిన మాడోత్ కల్యాణ్, దయ్యంబండ తండాకు చెందిన మాడోత్ వినోద్ కలిసి అక్రమంగా పేదలకు పంపిణీ చేసిన పీడీఎస్ బియ్యాన్ని కొనుగోలు చేసి తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి బియ్యంను సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

అవుసలి తండాలో పట్టుబడిన పీడీఎస్ బియ్యం

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

దంతాలపల్లి, డిసెంబర్ 30: విద్యార్థులు పట్టుదులతో చదివి చదివి వందశాతం ఉత్తీర్ణత సాధించాలని డీఈవో రవీందర్‌రెడ్డి సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో పదో తరగతి విద్యార్థులకు రూ.30వేల విలువైన స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ.. పదో తరగతి విద్యార్థులు ఒత్తిడికి లోను కాకుండా బాగాచదివి మంచి మార్కులు తెచ్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీవో శ్రీదేవి, పాఠశాల హెచ్ఎం వేణుమాధవ్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందిస్తున్న డీఈవో

పెట్రోల్ బంక్ కోసం స్థల పరిశీలన

బయ్యారం, డిసెంబర్ 30 : మండలకేంద్రంలో పెట్రోల్ బంక్ ఏర్పాటు కోసం ఆర్డీవో కృష్ణవేణి సోమవారం స్థల పరిశీలన చేశారు. మండల కేంద్రం శివారులో సర్వే నంబర్ 1636లో 18 గుంటల స్థలంలో బయ్యారం సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయనున్నారు. స్థలానికి సంబంధించిన పూర్తి వివరాలను తహసీల్దార్ విజయను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ నారాయణ, సర్వేయర్ శివయ్య పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీలు అమలు చేయాలి

డోర్నకల్, డిసెంబర్ 30 : ఎన్నికల సమయంలో ప్రజలకు హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు శెట్టివెంకన్న డిమాండ్ చేశారు. సోమవారం సీపీఎం డోర్నకల్ పట్టణంలోని కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. రైతులకు ఇప్పటివరకు రూ.2లక్షల రుణమాఫీ చేయలేదన్నారు. గ్యాస్ సబ్సిడీ, 200 యూనిట్లు ఉచిత కరెంట్ లబ్ధిదారులకు అందడం లేదన్నారు. సర్వేల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఉప్పెనపల్లి శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యుడు బొమ్మన అశోక్, నాయకులు శ్రీనివాస్, దాసరి మల్లేశం, నవాబ్ పాల్గొన్నారు.

కేజీబీవీలో ఆన్‌లైన్ తరగతులు

మహబూబాబాద్ రూరల్ : సమగ్ర శిక్ష, కేజీబీవీలో పనిచేస్తున్న ఉద్యోగులు 26 రోజులుగా నిరసన చేస్తున్నారు. ఈ క్రమంలో విద్యార్థుల చదువుకు ఇబ్బంది కలుగకుండా ఆన్‌లైన్ క్లాసులు అందిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం పట్టణంలోని కేజీబీవీలో ఇంటర్నెట్ సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. హైదరాబాద్ డైరెక్టరేట్ ఆదేశాల మేరకు జిల్లాలోని 15 కేజీబీవీ విద్యాలయాలకు పది, ఇంటర్ పరీక్షలు దగ్గరపడుతున్నందున, విద్యార్థులకు నష్టం జరగకుండా డిజిటల్ క్లాసులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ఇబ్బంది లేకుండా రాత్రిపూట మహిళా కానిస్టేబుల్స్ ద్వారా భద్రత కల్పిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు నేరుగా బీఈడీ ట్రైనింగ్ పొందిన వారితో క్లాసులు చెప్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌వో అప్పారావు, కో ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

టీయూడబ్ల్యూజే హెచ్-143 అర్బన్ కమిటీ

మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 30 : టీయూడబ్ల్యూజే హెచ్-143 (తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్) మహబూబాబాద్ అర్బన్ కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని ఐఎంఏ హాల్‌లో నిర్వహించిన జర్నలిస్టుల మహాసభలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈరగాని భిక్షం, జిల్లా కన్వీనర్ గుట్టయ్య, కో కన్వీనర్ శేఖర్ ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అర్బన్ అధ్యక్షుడిగా హనుమాండ్ల రామకృష్ణ, ఉపాధ్యక్షులుగా రాసూరి లక్ష్మణ్, ఇరుకుళ్ల కిరణ్, ప్రధాన కార్యదర్శిగా కరుణాక ర్, కోశాధికారిగా రాజు, సహాయ కార్యదర్శులుగా రామచంద్రు, రాజ్‌కుమార్, శ్రీధర్, చక్రధర్, రమేశ్, కమిటీ సభ్యులుగా సీతా రాం, దేవేందర్, యాకూబ్, ఆకుల నవీన్, రంజిత్, మీడియా ఇన్‌చార్జిగా శ్రీనివాస్‌ను నియమించారు. నూతన కమిటీకి హరితమిత్ర అవార్డు గ్రహీత దైద వెంకన్న మొక్కలు అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో బాబూరావు, గౌస్ పాషా, సుబ్రహ్మణ్యం, సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, రఘు పాల్గొన్నారు.

టీయూడబ్ల్యూజే హెచ్-143 అర్బన్ కమిటీ సభ్యులు

డిప్యుటేషన్‌పై కేజీబీవీలకు పంపొద్దు

ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న టీపీటీఎఫ్ నాయకులు

నెల్లికుదురు, డిసెంబర్ 30 : తమను రెగ్యులర్ చేయాలనే డిమాండ్‌తో 24 రోజులుగా ఎస్ఎస్ఏ ఉద్యోగులు సమ్మె చేస్తున్నారని, వారి స్థానంలో కేజీబీవీలో విద్యార్థులకు బోధించేందుకు ప్రభుత్వ ఉపాధ్యాయులను డిప్యుటేషన్‌పై పంపించొద్దని, సమగ్ర ఇంటింటి సర్వే చేసిన ఉపాధ్యాయులకు తక్షణమే రెమ్యునరేషన్ చెల్లించాలని టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడు వై యాకయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంపీడీవో బాలరాజుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడు తూ.. సమగ్ర ఇంటింటి సర్వే పూర్తయి నెల రోజులు దాటినా ఉపాధ్యాయులు, ఉద్యోగులకు ఇప్పటి వరకు రెమ్యునరేషన్ చెల్లించకపోవడం శోచనీయమన్నారు. ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమస్యలను పట్టించుకోకుండా వారి స్థానంలో ప్రత్యామ్నాయ ఏర్పా ట్లు చేయడం తగదన్నారు. తక్షణమే వారిని చర్చలకు పిలిచి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి సంగ శ్రీనివాస్, జిల్లా అడ్‌హక్ కమిటీ కన్వీనర్ వెంకటేశ్వర్లు, సంపత్ కుమార్, కరుణాకర్ పాల్గొన్నారు.

తండాల్లో సమస్యలు పరిష్కరించాలి

కురవి, డిసెంబర్ 30 : మండలంలోని గిరిజన తండాల్లో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గిరిజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐకి వినతిపత్రం అందజేశారు. గిరిజన సంఘం జిల్లా నాయకుడు మాలోత్ కిషన్ మాట్లాడుతూ.. తండాల్లో అనేక సమస్యలున్నాయని, వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు పెంచిన పింఛన్లు ఇవ్వాలన్నారు. భూములకు పట్టాలు లేక రైతు రుణమాఫీ కాలేదన్నారు. గతంలో టీడీపీ హయాం పేదలకు ఇళ్ల స్థలాల కోసం భూమి ఇచ్చారని, వాటికి ఇప్పటివరకు హద్దులు నిర్ణయించలేదన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం కురవి మండల అధ్యక్షుడు భానుత్ దేవా నాయక్, రాజేందర్‌నాయక్, బీకునాయక్, దేవ్‌సింగ్ నాయక్ పాల్గొన్నారు.

కురవి: వినతిపత్రం అందజేస్తున్న గిరిజన సంఘం నాయకులు

వచ్చేనెల 9న డిమాండ్స్ డే

మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 30 : దేశవ్యాప్తంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని అఖిల భారత యునైటెడ్ రైతు సంఘం నాయకుడు పాయం చిన్నచంద్రన్న పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద నిర్వహించిన సమావేశంలో ఆయన డిమాండ్స్ డే పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఢిల్లీలో రైతుల పోరాటం అనంతరం ఉపసంహరించుకున్న నల్ల చట్టాలను దొడ్డిదారిలో అమలుకు పూనుకోవడం రైతులను అవమానించడమేనన్నారు. రైతులు సాగు చేసుకుంటున్న భూములకు రైతుభరోసా ఇవ్వాలని, పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పైండ్ల యాకయ్య, కొత్తపల్లి రవి, సూర్యం, వెంకటేశ్వర్లు, సత్యం, రంగయ్య, ప్రవీణ్ పాల్గొన్నారు.

జనవరి 6న తలనీలాల వేలం

కురవి, డిసెంబర్ 30 : మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో భక్తులు సమర్పించే పుట్టువెంట్రుకలు, తలనీలాల పోగుచేసుకునేందుకు, తూర్పురాజగోపురం పక్కన ఖాళీ స్థలానికి జనవరి 6న వేలంపాట నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు జనవరి ఒకటి నుంచి 5 వరకు కార్యాలయంలో రూ.2వేలు చెల్లించి షెడ్యూల్ తీసుకోవాలని, రూ.6లక్షల డీడీ తీయాలని సూచించారు. ఆన్‌లైన్ ద్వారా గానీ, వేలంపాటలో గానీ పాల్గొనవచ్చన్నారు. తూర్పురాజగోపురం పక్కన ఖాళీ స్థలానికి వేలంలో పాల్గొనే వారు రూ.500 చెల్లించి షెడ్యూల్ తీసుకొని, రూ.లక్ష డీడీ చెల్లించాలన్నారు. ఈ-ప్రొక్యూర్‌మెంట్‌లో పాల్గొనేవారు టెండర్.తెలంగాణ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో లాగిన్ కావాలన్నారు. వివరాలకు 9491000704లో సంప్రదించాలన్నారు.

ప్రశాంతంగా జరుపుకోవాలి

డోర్నకల్, డిసెంబర్ 30: న్యూఇయర్ వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని డోర్నకల్ సీఐ భూక్యా రాజేశ్ సూచించారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ.. మద్యం మత్తులో వాహనాలు నడుపొద్దని, డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తామన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

గార్ల, డిసెంబర్ 30: పదో తరగతి ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని ఎస్సై రియాజ్ పాషా విద్యార్థులకు సూచించారు. సోమవారం గార్ల బాలికల జడ్పీహెచ్ఎస్‌లో మైనార్టీ స్వచ్ఛంద సంస్థ హిందీ ఉపాధ్యాయుడు ఎండీ అబ్దుల్ ఖాదీర్ ఆధ్వర్యంలో అల్పాహార కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కష్టపడి చదివితేనే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సుందర్, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, సురేందర్ రెడ్డి, వెంకటరెడ్డి, స్వామి పాల్గొన్నారు.

సర్వే రెమ్యునరేషన్ చెల్లించాలి

గార్ల, డిసెంబర్ 30: సర్వే రెమ్యునరేషన్ వెంటనే చెల్లించాలని టీపీటీఎఫ్ నాయకులు సోమవారం ఎంపీడీవో మంగమ్మకు వినతి పత్రం అందజేశారు. సర్వే చేసిన ఉపాధ్యాయులకు ప్రభుత్వ చెప్పిన విధంగా రెమ్యునరేషన్ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీపీటీఎఫ్ నాయకులు యాదగిరి, బాలాజీ, వెంకటేశ్వర్లు, వెంకట స్వామి పాల్గొన్నారు.

మండల వ్యాప్తంగా తనిఖీలు చేపడుతాం..

నర్సింహులపేట, డిసెంబర్ 30 : నూతన సంవత్సరం సందర్భంగా మండలంలో ప్రత్యేక తనిఖీలు చేపట్టనున్నట్లు ఎస్సై సురేశ్ తెలిపారు. సోమవారం స్థానికంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 31న రాత్రివేళలో తాగి వాహనాలు నడిపినా, మైనర్లు డ్రైవింగ్ చేసినా, ఓవర్ స్పీడ్, రాష్ డ్రైవ్, ట్రిపుల్ రైడ్ వంటి చేస్తే చట్ట పరమైన చర్యలు తప్పవన్నారు. నూతన సంవత్సర వేడుకల్లో డీజేలకు అనుమతి లేదన్నారు. రోడ్లపై కేక్‌లు కట్ చేయడం, పటాకులు కాల్చడం, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం వంటి చేస్తే శిక్ష తప్పదన్నారు. అందరూ సంతోషంగా కొత్త సంవత్సర వేడుకలు జరుపుకోవాలని తెలిపారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

దంతాలపల్లి : బాధిత కుటుంబానికి స్నేహితులు అండగా నిలిచారు. దంతాలపల్లికి చెందిన సోమారపు కృష్ణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, అతడితో 2005-06లో పదో తరగతి చదివిన స్నేహితులు కృష్ణ కుటుంబానికి సోమవారం రూ.21,500 ఆర్థిక సాయం అందజేశారు.కార్యక్రమంలో స్నేహితులు మంచాల శ్రీశైలం, యాకయ్య, మల్ల రాజు, అశోక్, సోమారపు రవి, యాకన్న, అశోక్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

దంతాలపల్లి, డిసెంబర్ 30 : చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి చెందిన ఘటన మండలంలో జరిగింది. ఎస్సై రాజు కథనం ప్రకారం.. మరిపెడ మండలం ఎల్లపేటస్టేజీ వెంకయ్యతండాకు చెందిన జాటోతూ బిక్యా(72) ఈ నెల 28న మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో నిలబడిఉన్నాడు. బీరిశెట్టిగూడెం నుంచి తొర్రూరుకు వెళ్తున్న ట్రాక్టర్ బిక్యాను ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతడి భార్య జగ్పి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన్నట్లు ఎస్సై తెలిపారు.

మెడికల్ షాప్ లైసెన్స్‌పై వేటు

తొర్రూరు, డిసెంబర్ 30 : తొర్రూరు పట్టణం కవిత హాస్పిటల్‌లోని సిద్ధార్థ మెడికల్ షాప్ లైసెన్స్‌పై వేటు వేస్తూ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఎస్ ఉమ రాణి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షణలో నిర్వహించిన తనిఖీల్లో ఫార్మాసిస్ట్ లేకుండా మందులు అమ్ముతున్నట్లు గుర్తించి, మెడికల్ షాప్ లైసెన్స్‌పై ఐదు రోజుల పాటు మందుల అమ్మొద్దని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పురుగుల మందుతాగిన వ్యక్తి

దవాఖాన తరలించిన పోలీసులు

నర్సింహులపేట, డిసెంబర్ 30 : పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి కనిపించకుండా వ్యక్తిని ఫోన్ సిగ్నల్ ఆధారంగా పోలీసులు గుర్తించి ప్రైవేట్ వాహనంలో దవాఖానకు తరలించారు. ఎస్సై సురేశ్ కథనం ప్రకారం.. మండలంలోని కొమ్ములవంచ గ్రామానికి చెందిన తుంపిల్ల ఉపేందర్ ఇంట్లో జరిగిన చిన్న తగాదా కారణంగా మనస్తాపం చెంది, తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి కనిపించకుండాపోయాడు. కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో, ఏఎస్సై వెంకన్న, బ్లూకోల్ట్స్ సిబ్బంది విజయ్, లక్ష్మణ్ ఫోన్ సిగ్నల్ ఆధారంగా ఉపేందర్ ఉన్న ప్రదేశాన్ని గుర్తించి, 108లో జిల్లా కేంద్రంలోని ఏరియా వైద్యశాలకు తరలించారు.

ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ వేడుకలు

కురవి, డిసెంబర్ 30 : భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) కురవి మండల కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సోమవారం ఎస్ఎఫ్ఐ 55వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా కో కన్వీనర్ గంధసిరి జ్యోతిబసు మాట్లడుతూ.. ఎస్ఎఫ్ఐ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి అలుపెరగని పోరాటం చేస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో మనోజ్, వరుణ్, పూజేశ్, స్వప్న, అక్షిత, హరిణి, అనూష, సరిత, కార్తీక్ పాల్గొన్నారు.

శతాబ్ది ఉత్సవాలకు తరలిన శ్రేణులు

కురవి: భారత కమ్యూనిస్టుపార్టీ శతాబ్ది ఉత్సవాలకు మండల కేంద్రంలోని నియోజకవర్గ కార్యాలయం నుంచి సోమవారం పార్టీ శ్రేణులు నల్గొండకు బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు నెల్లూరు నాగేశ్వరరావు, కురవి మండల కార్యదర్శి కరణం రాజన్న, మండల కార్యదర్శి తురక రమేశ్, కన్నె వెంకన్న, బుర్ర సమ్మయ్య, తురక రమేష్, దూదికట్ల సారయ్య, కొమరయ్య, రవి పాల్గొన్నారు.

తొర్రూరు నుంచి..

తొర్రూరు, డిసెంబర్ 30 : నల్గొండలో జరిగిన సీపీఐ వార్షికోత్సవ సభకు మండలం నుంచి పార్టీ శ్రేణులు సోమవారం పెద్ద ఎత్తున తరలివెళ్లారు. సీపీఐ జిల్లా నాయకుడు భిక్షపతి, మండల కార్యదర్శి బందు మహేందర్, సాయిరెడ్డి, నరసింహారెడ్డి, వీరన్న, మంగళపల్లి మల్లయ్య, యాకయ్య, శ్రీను తదితరులు తరలివెళ్లిన వారిలో ఉన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

PLOTS FOR SALE

★80% బ్యాంకు లోన్‌తో వరంగల్ హైవే ఆనుకొని గేటెడ్ కమ్యూనిటీ DTCP అప్రూవ్డ్ ప్లాట్స్, కంప్లీట్ CC రోడ్స్, ఎలక్ట్రిసిటీ, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, వాటర్ ట్యాంక్‌తో. సంప్ర: 8109994456.
NT-326623

WANTED

★ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు, ఇంటిపని, వంటపని చేయుటకు వర్కర్లు, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 20K. 8977639662 / 8977639663.
NT-338992-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565